సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 18 । జూన్ । 2024



ప్రభుత్వ ఆస్పత్రుల్లో..
ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందేలా చూస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు.
- 9లో ▸



భారీ చోరీ
సిరికొండ మండలంలోని న్యావనందిలో తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ జరిగింది. 18.5 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
39.8 /22.7
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అడపాదడపా జల్లులు కురిసే అవకాశా లున్నాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురియవచ్చు.

న్యూస్‌రీల్

‘విద్యుత్ ప్రజావాణిలో 22 ఫిర్యాదులు నమోదు’



కామారెడ్డి అర్బన్: జిల్లాలోని విద్యుత్ కార్యాలయాలలో సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం పది గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సెక్షన్ ఆఫీసులు, సబ్ డివిజన్, డివిజన్, ఈఆర్‌వో కార్యాలయాల్లో, మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్‌ఈ కార్యాలయంలో కార్యక్రమం కొనసాగింది. జిల్లాలో విద్యుత్ వినియోగదారుల నుంచి 22 వినతులు వచ్చాయని ఎస్‌ఈ రమేశ్‌బాబు తెలిపారు. టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు. ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. విద్యుత్‌కు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా ప్రతి సోమవారం నిర్వహించే విద్యుత్ ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు.

బెటాలియన్ కమాండెంట్‌గా రోహిణి ప్రియదర్శిని



ఖలీల్‌వాడి: డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్ కమాండెంట్‌గా రోహిణి ప్రియదర్శినిని నియామిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఉన్న కమాండెంట్ రామ్‌ప్రకాశ్‌ను డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. ఐపీఎస్ రోహిణి ప్రియదర్శిని నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ సతీమణి. నార్త్ జోన్ డీసీపీగా పనిచేసిన ఆమె బదిలీపై డిచ్‌పల్లి బెటాలియన్ కమాండెంట్‌గా వస్తున్నారు.

పోలింగ్ బూత్‌ల అధ్యక్షులకు సన్మానం



సదాశివనగర్: పార్లమెంట్ ఎన్నికల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీజేపీకి అత్యధిక ఓట్లు పోలైన రెండు పోలింగ్ బూత్‌ల అధ్యక్షులను సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సన్మానించారు. మండల కేంద్రంలోని 59వ పోలింగ్ బూత్‌లో 77 శాతం ఓట్లు(459 ఓట్లు) బీజేపీకి పోలయ్యాయి. అలాగే 60వ బూత్‌లో 72 శాతం(421 ఓట్లు) కాషాయ పార్టీకి వచ్చాయి. ఆయా బూత్ కమిటీల అధ్యక్షులు ధర్మారెడ్డి, నాయిని నడిపి గంగయ్యలను బీజేపీ మండలాధ్యక్షుడు రాంరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ రెండు పోలింగ్ బూత్‌లలో బీజేపీకి నియోజకవర్గంలో అత్యధికంగా ఓట్లు వచ్చాయని రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భూంరావు, జైపాల్‌రెడ్డి, కటికె రమేశ్, బంజ బస్వయ్య, సత్యంరెడ్డి, వంకాయల రవి, వీరేడ్డి, లోకుల వెంకటేశం, మడిపెద్ది ఆనంద్, ఆశన్న, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి రోటరీ క్లబ్ అధ్యక్షుడికి అవార్డు



కామారెడ్డి అర్బన్: రాష్ట్రంలో మీడియం రోటరీ క్లబ్‌ల విభాగంలో కామారెడ్డి రోటరీ క్లబ్ అధ్యక్షుడు పోలబోయిన సత్యం ఉత్తమ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. భద్రాచలంలో ఆదివారం నిర్వహించిన ‘సేవలకు పట్టాభిషేకం’ రోటరీ పురస్కారాల ప్రదానం కార్యక్రమంలో ఆయన రోటరీ గవర్నర్ బుసిరెడ్డి శంకర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఏడాది కాలంలో 60 సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు అవార్డు వరించిందని సత్యం తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కామారెడ్డి కార్యదర్శి పెనుబెల్లి రాజనర్సింహారెడ్డి, కోశాధికారి తోర్నాల సుధాకర్, మాజీ అధ్యక్షులు డాక్టర్ బెల్లపు బాలరాజు, అయిత బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

సంగ్వాన్‌కు సవాళ్లెన్నో!

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆశిష్ సంగ్వాన్‌కు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ప్రతిపక్షానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకుల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు, కాళేశ్వరం 22 వ ప్యాకేజీలో భూసేకరణ, జిల్లాకేంద్రంలో రోడ్ల విస్తరణ, విద్య, వైద్యారోగ్య శాఖల ప్రక్షాళన ప్రధాన సవాళ్లుగా నిలవనున్నాయి.

- ప్రజాప్రతినిధులు, నేతల మధ్య ఆధిపత్య పోరు
- జిల్లా కేంద్రంలో జటిలంగా మారిన రోడ్ల విస్తరణ
- కాళేశ్వరం 22 వ ప్యాకేజీకి భూసేకరణ సమస్య
- గాడితప్పిన విద్య, వైద్యారోగ్య శాఖలు
- కొత్త కలెక్టర్‌కు సమస్యల స్వాగతం



రోడ్ల విస్తరణ పెద్ద టాస్క్

కామారెడ్డి పట్టణం జిల్లా కేంద్రంగా మారినప్పటికీ ప్రధాన రోడ్లు ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. సమస్య పరిష్కారం కోసం ప్రధాన రోడ్లను విస్తరించాల్సి ఉంది. ప్రజలకు రోడ్ల విస్తరణపై అవగాహన కల్పించి, వారిని సముదాయించి పనులు చేపట్టాల్సి ఉంటుంది. రోడ్ల విస్తరణతో పాటు జంక్షన్లను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఈ పనులు చేయాలంటే స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, నేతల మధ్య సమన్వయం కుదర్చాల్సి ఉంటుంది. అలాగే జిల్లా కేంద్రంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. దానికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

సాక్షి, కామారెడ్డి: విభిన్న రాజకీయాలకు వేదికగా మారిన కామారెడ్డి జిల్లాలో ప్రజాప్రతినిధులను సమన్వయం చేయడం అంటే పెద్ద సవాలే. ముఖ్యంగా కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయాలు రసవత్తరంగా ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా, ఇక్కడ బీజేపీకి చెందిన వెంకటరమణారెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అయితే ఇదే నియోజకవర్గానికి చెందిన షబ్బీర్‌అలీ ప్రభుత్వ సలహాదారు హోదాలో ఉన్నారు. నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి విషయంలో ఇటీవల ఇరువురు వేరువేరుగా పాత కలెక్టర్ సమక్షంలో రివ్యూ నిర్వహించారు.

బాన్సువాడలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొంది. బీఆర్‌ఎస్‌కు చెందిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయనకు అపారమైన రాజకీయ అనుభవం ఉంది. మంత్రిగా, స్పీకర్‌గా పనిచేశారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ఈ నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నారు. ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును పలుమార్లు నియోజకవర్గానికి రప్పించారు. తద్వారా అధికార పార్టీ నేతగా తన మాట చెల్లుబాటయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఎమ్మెల్యేగా తన హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని, నియోజకవర్గానికి తానే బాస్‌నని పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. దీంతో నియోజకవర్గంలో ఎవరి మాట వినాలన్న దానిపై అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఈ రెండు నియోజకవర్గాలలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలను సమన్వయం చేయడం కొత్త కలెక్టర్‌కు సవాల్‌గా నిలవనుంది.

‘కాళేశ్వరం’ ముందుకు సాగేనా?

జిల్లాలో సాగునీటి కష్టాలు తీర్చేందుకు ఉద్దేశించిన కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం ఈ పనులపై దృష్టి సారించింది. అయితే జిల్లాలో ప్రాజెక్టు కాలువలు, రిజర్వాయర్ల నిర్మాణాలకు భూసేకరణ చేపట్టాల్సి ఉంది. భూసేకరణకు రైతులను ఒప్పించడంతో పాటు వారు కోరిన విధంగా పరిహారం ఇప్పించేందుకు చెమటోడ్చాల్సి ఉంటుంది.

పాలన గాడిన పడేనా?

జిల్లాలో విద్యాశాఖతో పాటు వైద్య ఆరోగ్య శాఖలు గాడితప్పాయి. గత విద్యాసంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు ఎక్కువ మంది ఫెయిల్ అయ్యారు. ఫలితాల్లో కామారెడ్డి చివరి స్థానాలకు పడిపోయింది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో విద్యావ్యవస్థ అధ్వానంగా తయారయ్యింది. కొందరు ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొడుతూ పైరవీల కోసం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. మరికొందరు సొంత వ్యాపారాల్లో మునిగితేలుతున్నారు. అలాగే జిల్లాలో వైద్య, ఆరోగ్యానికి సంబంధించి అనేక సమస్యలు ఉన్నాయి. మారుమూల ప్రాంతమైన జుక్కల్ నియోజకవర్గంలో ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి పనితీరు మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఎల్లారెడ్డి, గాంధారి తదితర ప్రాంతాల్లో ఆస్పత్రుల్లో వైద్యులను నియమించి, సేవలు విస్తరించే ప్రయత్నాలు జరగాల్సి ఉంది. మున్సిపాలిటీల్లో ఖర్చులకు అనుగుణంగా ఆదాయం పెరగకపోవడానికి గల కారణాలను అన్వేషించి ‘పురపాలన’ను సైతం గాడిలో పెట్టాల్సిన అవసరం ఉంది. ఆయా అంశాలపై నూతన కలెక్టర్ ఏ విధంగా ముందుకు సాగుతారన్న అంశంపై సర్వత్రా చర్చ సాగుతోంది.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో ముస్లింలు సోమవారం బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వద్దనున్న ఈద్గా వద్ద ముస్లింలు పెద్ద ఎత్తున ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ త్యాగాలకు ప్రతీక బక్రీద్ అన్నారు. సకల మత విశ్వాసాలను, సంప్రదాయాలను గౌరవిస్తూ దేశంలో, రాష్ట్రంలో పాలన కొనసాగాలని ఆకాంక్షించారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కాంగ్రెస్ జిల్లా నాయకులు షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

టీచర్ల పదోన్నతుల ప్రక్రియ పూర్తి

- 874 మందికి పదోన్నతి
- నేడు ఎస్జీటీల బదిలీల ప్రక్రియ ప్రారంభం



కామారెడ్డి టౌన్: జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ పూర్తయ్యింది. 874 మంది పదోన్నతుల కోసం వెబ్ ఆప్షన్‌లను ఎంచుకున్నారు. జిల్లా అధికారులు తుది జాబితాను రాష్ట్ర విద్యాశాఖకు ఆన్‌లైన్‌లో సమర్పించారు. సోమవారం తుది జాబితా డీఈవో కార్యాలయానికి చేరింది. తెలుగు పండిట్‌లు 193 మంది, హిందీ 180 మంది, ఉర్దూ 5, మరాఠి పండిట్‌లు ఇద్దరు స్కూల్ అసిస్టెంట్‌లుగా అప్‌గ్రేడ్ అయ్యారు. 78 మంది పీఈటీలు ఫిజికల్ డైరెక్టర్‌లుగా, 416 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందారు. వీరికి మంగళవారం ఆర్డర్ కాపీలను అందించనున్నారు. ఆ వెంటనే వారు విధుల్లో చేరాల్సి ఉంటుంది. కాగా వీరిలో సుమారు 15 మంది ఉపాధ్యాయులు వృద్ధాప్యం, అనారోగ్యం, పదవీ విరమణ కాలం దగ్గరగా ఉండడం, దూర ప్రాంతానికి వెళ్లడానికి ఇష్టం లేకపోవడం లాంటి కారణాలతో పదోన్నతులకు దూరంగా ఉండే అవకాశాలు ఉన్నాయి.

బదిలీల కోసం 1,400 దరఖాస్తులు

సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్జీటీ) బదిలీల ప్రక్రియ మంగళవారం ప్రారంభంకానుంది. ఇందుకోసం జిల్లా అధికారులు జాబితాను సిద్ధం చేశారు. జిల్లాలో సుమారు 1,400 మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. బదిలీల ప్రక్రియ మంగళవారం ప్రారంభమవుతుందని డీఈవో ఎస్.రాజు తెలిపారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



బీటీ రోడ్లకు మంజూరైన నిధుల పత్రాలను చూపుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని ఐదేళ్లలో రూ. వెయ్యి కోట్లతో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పేర్కొన్నారు. సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆరు నెలల కాలంలో ఎల్లారెడ్డి అభివృద్ధి కోసం రూ. 200 కోట్లు మంజూరు చేయించానన్నారు. ప్రస్తుతం ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని పలు మండలాలలో బీటీ రోడ్ల నిర్మాణం కోసం రూ. 36 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ. 250 కోట్లు మంజూరు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఎల్లారెడ్డిలో ఐటీ కారిడార్ కోసం 50 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఉన్నతాధికారులను కోరానని తెలిపారు. స్థలం మంజూరు కాగానే ఐటీ కారిడార్ నిర్మిస్తామన్నారు. ఈనెల 20, 21 తేదీలలో జిల్లా స్థాయి అధికారులతో నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, జెడ్పీటీసీ ఉషాగౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, నాయకులు సాయిబాబా, నారాగౌడ్, సామెల్, వెంకట్రాంరెడ్డి, చెన్న లక్ష్మణ్, ప్రశాంత్‌గౌడ్, ఆరిఫ్, శ్రీనివాస్ రెడ్డి, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేవీఆర్ తనయుడికి అస్వస్థత

- సర్కారు దవాఖానాకు తరలింపు

కామారెడ్డి టౌన్: తీవ్ర జ్వరంతో బాధపడుతున్న తనయుడిని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి. వివరాలిలా ఉన్నాయి. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తనయుడు మైత్రేయకు ఆదివారం రాత్రి తీవ్ర జ్వరం వచ్చింది. ఆ సమయంలో ఎమ్మెల్యే ఢిల్లీలో ఉన్నారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా.. కామారెడ్డిలోని జిల్లా జనరల్ ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు మైత్రేయను రాత్రి 11 గంటల ప్రాంతంలో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి, ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుని వైద్య సేవలు అందించారు. ఎమ్మెల్యే కేవీఆర్ ఆస్పత్రిలోని వైద్యులకు ఫోన్ చేసి కుమారుడి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. కాగా సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో జ్వరం తీవ్రం కావడంతో పాటు గుండెలో ఇన్‌ఫెక్షన్ ఉందని వైద్య పరీక్షల్లో తేలడంతో మెరుగైన వైద్య సేవల కోసం వైద్యులు హైదరాబాద్‌కు సిఫారసు చేశారు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

సగానికి పైగా సన్నాలే..

- స్వల్పంగానే దొడ్డు రకాలు సాగు
- బోనస్ ప్రకటనతో సన్నాలకు మళ్లిన రైతులు
- జీపీటీ-5204, తెలంగాణ సోనా, కునారం-1638 రకాలపై ఆసక్తి



డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఒక్క ‘బోనస్’ ప్రకటనతో జిల్లాలోని రైతులంతా సన్నాల వైపు మళ్లారు. ఇన్నాళ్లూ వరి పంటలో సింహభాగం దొడ్డు రకాలే ఉండగా, ఈ ఏడాది ఖరీఫ్‌కు వచ్చేసరికి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గతానికి భిన్నంగా ఈ సీజన్‌లో నూటికి 70శాతం మంది రైతులు సన్నాలు సాగు చేసేందుకు ముందు వచ్చారు. దీంతో విత్తన దుకాణాల్లో ఎక్కువగా సన్నరకాల విత్తన వడ్లు అమ్ముడు పోతున్నాయి. ఏ రకాల విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారులను, డీలర్లను రైతులు సంప్రదించి కొనుగోలు చేస్తున్నారు. చీడపీడలు సోకని మంచి దిగుబడి వచ్చే బీపీటీ-5204 రకాన్ని ఎక్కువ మంది రైతులు సాగు చేస్తున్నారు. ఎందుకంటే ఈ రకానికి ఎకరానికి 28-30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. తెలంగాణ సోనా, కునారం-1638, గంగా కావేరి లాంటి రకాలను కూడా కొనుగోలు చేసి తుకాలు పోస్తున్నారు. కొంతమంది జైశ్రీరాం, హెచ్‌ఎంటీ రకాలు కూడా సాగు చేస్తున్నారు. అయితే, రైతులు సన్నరకాల వడ్లు సాగు చేసేందుకు ముందుకు రావడంతో వ్యవసాయాధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే, గతంలో దొడ్డు నుంచి సన్నాలకు మళ్లించడానికి అధికారులు అవగాహన సదస్సులు పెట్టి ఎన్ని ప్రయత్నాలు చేసినా రైతులు మారలేదు.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేసిన సన్నాలకు ‘బోనస్’ ప్రకటనతో ఒక్కసారిగా రైతులు సన్నరకాల వైపు ఆసక్తి చూపించారు. సన్న రకాలకు తెగుళ్లు, చీడపీడలతో పాటు దిగుబడి కూడా కొంత తక్కువగా వస్తుందని తెలిసీ కూడా ‘బోనస్’ వస్తుందనే ధైర్యంతో సాగు చేయడానికి ముందుకొచ్చారు. దొడ్డు రకాల విషయానికి వస్తే ప్రభుత్వ బోనస్ ప్రకటనకు ముందే కొంత మంది రైతులు తుకాలు పోశారు. దీంతో వారు సన్నాలకు మళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. 20-30 శాతం మట్టుకే దొడ్డు రకాలు పరిమితం అయ్యాయి. దొడ్డులో ఎంటీయూ-1010, జేజీఎల్-24423 రకాలను సాగు చేస్తున్నారు. ఈ దొడ్డు రకాలకు ఎకరానికి 30 క్వింటాళ్లకు పైబడి దిగుబడి వస్తుంది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు 4.30లక్షల ఎకరాలకు పైగా వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 70శాతం వరకు సన్నాలే సాగయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

విత్తన వరికి ‘బోనస్’ ఉందా?

సన్నాలు సాగు చేసే రైతులకే ‘బోనస్’ ఇస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనతో విత్తన వరిని సాగు చేస్తున్న రైతుల్లో కొంత ఆందోళన నెలకొంది. ఎందుకంటే వ్యాపారులతో బైబ్యాక్ ఒప్పందంతో చేసుకుని సన్నరకాల విత్తన వరిని సాగుచేసే రైతులు జిల్లాలో 10-15 శాతం ఉంటారు. చేతికి వచ్చిన విత్తన పంటను వ్యాపారులే తీసుకెళ్తారు. ఇలాంటి రైతులకు ప్రభుత్వం బోనస్ ఇస్తుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. సన్నాలతో విత్తన వరిని సాగు చేసే వారికి కూడా బోనస్ ఇవ్వాలని సంబంధిత రైతులు, కౌలు చేసే రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పదిహేను ఎకరాలు సన్నాలే..



కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రకటన చేయడంతో చాలా మంది రైతులు సన్నరకాల వరినే సాగు చేయడానికి ముందుకు వచ్చారు. నేను కూడా రెండు రకాల వడ్లు తుకం పోశాను. సొంతంగా ఐదెకరాలు కాకుండా మరో పదెకరాల భూమిని కౌలుకు తీసుకుని సన్నరకాలు సాగు చేస్తున్నా.

– సుంకరి రాజు, దత్తాపూర్, డొంకేశ్వర్ మండలం

‘పోడు’ పరిష్కారం అయ్యేనా?

- మోపాల్ మండలం కాల్పోల్ ఘటన నేపథ్యంలో సమీక్షించిన మంత్రి కొండా సురేఖ
- గతేడాది జిల్లాలో 14,093 దరఖాస్తులు రాగా 4,229 మందికి పోడు పట్టాలు
- రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం ఇచ్చిన పట్టాలపైనా నివేదిక కోరిన మంత్రి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలోని మోపాల్ మండలం కాల్పోల్ సమీపంలో అటవీ అధికారులపై దాడి ఘటన నేపథ్యంలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ శనివారం హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. ఇందులో పోడు భూములపై కీలక చర్చ జరిగింది. గత ఏడాది బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పోడు భూముల పట్టాలకు సంబంధించి ప్రధానంగా చర్చించారు. కేసీఆర్ ప్రభుత్వం అనర్హులకు సైతం పట్టాలు ఇచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ఇలా ఇచ్చిన పట్టాలకు సంబంధించి పూర్తి స్థాయి నివేదిక అందజేయాలని మంత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు. గత ఏడాది ఇచ్చిన పట్టాలకు సంబంధించి పలువురు అనర్హులు ఉన్నట్లు సమావేశంలో చర్చ జరగడం గమనించాల్సిన అంశం. ఇలా ఇచ్చిన వాటిలో 2022లో పోడు కొట్టిన భూములకు సైతం పట్టాలు పంపిణీ చేసినట్లు కొందరు చెప్పినట్లు తెలిసింది.

- జిల్లాలో పోడు భూములకు సంబంధించి 14,093 దరఖాస్తులు రాగా ఇందులో 4,229 మందికి గతేడాది పట్టాలు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు తమకు నచ్చినవారికే పట్టాలు పంపిణీ చేశారని, ఏళ్లతరబడి పోడు సాగు చేసుకుంటున్న తమకు మాత్రం పట్టాలు ఇవ్వలేదంటూ జిల్లాలోని తండాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడు దరఖాస్తుదారుల్లో పట్టాలు రానివారందరూ కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మరడంతో అర్హులైన తమకు పోడు పట్టాలు అందించాలని కోరుతున్నారు. దీంతో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ హయాంలో అందజేసిన పోడు భూముల పట్టాలపై దృష్టి పెట్టింది. తాజాగా చోటుచేసుకున్న కాల్పోల్ ఘటన నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే సమీక్షకు ఉపక్రమించింది. ఈ క్రమంలో మంత్రి సురేఖ సమీక్షతో కదలిక వచ్చింది.
- రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది పోడు భూముల పంపిణీపై నివేదిక సమర్పించాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించిన నేపథ్యంలో జిల్లా నుంచి సైతం పోడు భూములపై నివేదికను పంపేందుకు రంగం సిద్ధం చేశారు. మోపాల్ మండలం కాల్పోల్ సమీపంలో అటవీ అధికారులపై గిరిజనుల దాడిని మంత్రి సీరియస్‌గా తీసుకున్నారు. పోడు భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, అదే సమయంలో చట్టానికి విరుద్ధంగా అటవీ భూములను ఆక్రమించినా, ఆక్రమణలు అడ్డుకున్న అటవీ అధికారులపై దాడులు చేసినా, సదరు వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సురేఖ స్పష్టం చేయడం గమనార్హం.
- ఇదిలా ఉండగా గత ప్రభుత్వం కొంతమంది గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వడంతో తమకు కూడా ప్రభుత్వం పట్టాలు ఇవ్వకపోతుందా అనే ఉద్దేశంతో కొత్తగా కొందరు అటవీ భూములను ఆక్రమిస్తున్నారు. దీంతో అటవీ శాఖ అధికారులకు మళ్లీ తలనొప్పి మొదలైంది. అటవీ భూములను రక్షించేందుకు వెళ్లిన అధికారులను అక్కడి వ్యక్తులు బెదిరిస్తుండడంతో పాటు దాడులకు దిగుతుండడంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలో పోడు భూముల సమస్య ఎప్పటికి పరిష్కారం అవుతుందోననే పరిస్థితి నెలకొంది.



కాల్పోల్‌లో తమపై దాడికి యత్నిస్తున్న వ్యక్తిని అడ్డుకుంటున్న అటవీ అధికారులు(ఫైల్)

క్లుప్తంగా

‘తైక్వాండో’ బెల్టుల ప్రదానం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని గంగస్థాన్ ఫేస్ -2 లో గల రామకృష్ణ మఠంలో సోమవారం తైక్వాండో కలర్ బెల్ట్స్ ప్రమోషన్ టెస్టులు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన తైక్వాండో క్రీడాకారుల విన్యాసాలు అందరిని ఆకర్షించాయి. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో ప్రధాన కార్యదర్శి, జేసీఐ జిల్లా అధ్యక్షుడు మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో తైక్వాండో జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ రావు పాల్గొని, మాట్లాడారు. నేటి రోజుల్లో ఆత్మరక్షణకు తైక్వాండో క్రీడ ఎంతో అవసరమన్నారు. అనంతరం క్రీడాకారులకు సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. జేసీఐ జోన్ ఆఫీసర్ నయన్, గంగ నర్సయ్య ఉన్నారు.

రెగ్యులర్ వీసీని నియమించాలి



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ యూనివర్సిటీకి నిజాయితీగల వారిని రెగ్యులర్ వీసీగా నియమించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని కోటగల్లి నీలం రామచంద్రయ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ పాలకులు అన్ని యూనివర్సిటీలను భ్రష్టు పట్టించారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ యూనివర్సిటీకి అధిక నిధులు కేటాయించి, తెయూ అభివృద్ధికి పాటుపడాలన్నారు. నాయకులు ప్రిన్స్, రాజేష్, అరుణిక, అభిగ్న, రాజు పాల్గొన్నారు.

జింకపై కుక్కల దాడి



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతంలో జింకపై కుక్కలుదాడి చేశాయి. ఈ ఘటన బాల్కొండ మండలం బస్సాపూర్ గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. బస్సాపూర్ శివారు నుంచి వచ్చిన జింకపై కుక్కలు దాడి చేస్తూ వెంటాడగా పరుగుతీస్తూ గ్రామవైపు వచ్చింది. గమనించిన స్థానికులు జింకకు వైద్యం అందించి ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు.

తల్లిచేపలు ఎక్కడ?

- దక్షిణ భారతదేశంలో తల్లిచేపల కోసం పోచంపాడ్ ఎంపిక
- ఏడేళ్లయినా ఉత్పత్తి లేదు..
- ముళ్ల పొదల్లో మగ్గుతున్న కేంద్రం



ముళ్ల పొదల్లో తల్లి చేపల కేంద్రం కుండీలు

బాల్కొండ: దక్షిణ భారతదేశంలోనే పోచంపాడ్ వద్ద తల్లి చేపల కేంద్రం నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం 2017లో నిధులు మంజూరు చేసి రూ.5 కోట్లతో తల్లి చేపల కేంద్రం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో సగం వాటా రాష్ట్ర ప్రభుత్వం భరించాలని సూచించింది. అయితే, చేపపిల్లల పునరుద్ధరణ కేంద్రం కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్లో నుంచే తల్లి చేపల కేంద్రానికి నిధులను మళ్లించింది. 2017లో పనులు ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు ఒక్క తల్లి చేప ఉత్పత్తి చేపట్టలేదు. దీంతో తల్లి చేపలు ఎక్కడ? అంటూ మత్స్య కారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచి నీటి చేపలను ఉత్పత్తి చేసి నాణ్యమైన తల్లి చేపలను ఉత్పత్తి చేస్తే అందులో నుంచి నాణ్యమైన చేప పిల్లలను ఉత్పత్తి చేయొచ్చని భావించి తల్లిచేపల కేంద్రాన్ని నిర్మించింది. తల్లి చేపల కేంద్రం అధ్యయనం కోసం జిల్లా నుంచి అనేక మంది మత్స్యకారులు, అధికారులు సైతం ఒడిశాకు వెళ్లారు. అయినప్పటికీ ఇక్కడ మాత్రం ఇప్పటికీ తల్లిచేపలు ఉత్పత్తి కావడం లేదు. గతేడాది ఒడిశా నుంచి నాణ్యమైన చేపలను తల్లి చేపల పెంపకం కోసం ప్రభుత్వం సరఫరా చేసిన చేపలు ఎక్కడ ఉన్నాయో అధికారులకే తెలియదు. తల్లి చేపల కేంద్రంలో నీటి కొరత తీవ్రంగా ఉండడంతో ఆ చేపలు చనిపోయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. చేపలకు సంబంధించిన లెక్క అంతా గందరగోళంగా మారింది.

ఇప్పటికీ పూర్తి కాని పనులు

తల్లి చేపల కేంద్రం ప్రస్తుతం ముళ్లపొదల్లో మగ్గుతోంది. కేంద్రం నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది.



తల్లి చేపల కేంద్రం

కేంద్రంలో మట్టి పాండ్లు ఏర్పాటు చేసి నిర్వహణను మరిచారు. దీంతో అక్కడి పరిస్థితిని చూస్తే తల్లి చేపల కేంద్రం ఇలా ఉంటుందా? అని ఆశ్చర్యం కలుగుతుంది. ఇక్కడ చేపపిల్లల ఉత్పత్తి జరిగితే.. ప్రస్తుతం చేపపిల్లల సరఫరా కోసం కొనసాగుతున్న కమీషన్ టెండర్లకు మంగళం పాడుతారని తల్లి చేపల కేంద్రాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి తల్లిచేపల కేంద్రాన్ని పట్టించుకోవాలని వేడుకుంటున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

పోచంపాడ్‌లోని తల్లి చేపల కేంద్రం పనులు అసంపూర్తిగా ఉండడంపై జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. త్వరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. తల్లి చేపలు ఇక్కడే ఉత్పత్తి అయితే నాణ్యమైన చేప పిల్లలను ఉత్పత్తి చేయొచ్చు.

– రాజానర్సయ్య, ఏడీ మత్స్యశాఖ, నిజామాబాద్

అప్పుడు హరితం.. ఇప్పుడు హతం



తుజాల్‌పూర్ రోడ్డులో నరికేసిన చెట్లు

- హరితహారం మొక్కలు నాటడంలో అధికారుల నిర్లక్ష్యం
- విద్యుత్ సరఫరాలో అంతరాయం వస్తుందని చెట్ల నరికివేత

బీబీపేట: ప్రభుత్వం హరితహారంలో భాగంగా ముందుచూపు లేకుండా మొక్కలు నాటడం వల్ల ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుతం అవి పెద్ద చెట్లుగా ఎదగడం వల్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగులుతున్నాయి. ఈ కారణంతో చెట్లను నరికివేస్తున్నారు. ముందుచూపు లేకుండా ప్రభుత్వ లక్ష్యానికి చేరువ కావాలనే ఉద్దేశంతో అటు అధికారులు సైతం ఆలోచించకుండా మొక్కలను విద్యుత్ స్తంభాల కిందనే నాటారు. ప్రతి రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ తీగలు ఉన్నప్పటికీ మొక్కలను నాటారు. వైర్లకు కొమ్మలు తగిలి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందనే కారణంతో నరికివేసినట్లు విద్యుత్ అధికారులు బదులిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ మొక్కలను నాటి పెరిగిన తర్వాత నరికివేయడంతో మొక్కలకు పెట్టిన ప్రజాధనం వృథా అయిందని పలువురు వాపోతున్నారు.

వృద్ధుడిపై కత్తితో దాడి

నాగిరెడ్డిపేట (ఎల్లారెడ్డి): మండలంలోని రాఘవపల్లి గ్రామానికి చెందిన నార్ల నాగయ్య అనే వృద్ధుడిపై సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడి చేశారు. నాగయ్య కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామశివారుకు వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు వెనుక నుంచి వచ్చి కత్తితో గొంతు కోశారు. అదే సమయంలో పొలంవైపు వెళ్లిన రైతులు అపస్మారక స్థితిలో పడిఉన్న నాగయ్యను గుర్తించి చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ రవీందర్‌నాయక్ గ్రామానికి చేరుకొని ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు.

పార్కుస్థలం కబ్జాకు యత్నం



పార్కుస్థలంలోని చెట్లను నరికివేస్తున్న దృశ్యం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని వినాయక్‌నగర్‌లో గల పార్కు స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేసేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. సదరు వ్యక్తి పార్కుస్థలంలోని చెట్లను నరికివేయించగా పలువురు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల నాల్గోటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి. అధికారులు మంగళవారం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి పార్కు స్థలాన్ని పరిశీలించనున్నారు.

ఇటుక బట్టీలకు ఎస్సారెస్పీ మట్టి

- రాత్రి వేళల్లో యథేచ్ఛగా తరలింపు
- ప్రాజెక్టు చుట్టూ బట్టీల ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌నుంచి ఇటుక బట్టీలకు యథేచ్ఛగా మట్టి తరలిపోతున్నా ప్రాజెక్ట్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వేల టిప్పర్ల మట్టిని తరలించ వచ్చనే ఉద్దేశంతో ప్రాజెక్టు చుట్టు ప్రాంతాల్లో ఇటుక బట్టీలను ఏర్పాటు చేశారు.

అయితే, బట్టీల ఏర్పాటుకు అనుమతులు లేకున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి నెలా ఇటుకబట్టీల నిర్వాహకులు అధికారులకు కావాల్సింది ముట్టజెప్పుతుండంతో మట్టి యథేచ్ఛగా తరలుతోందనే పలువురు అంటున్నారు. ప్రాజెక్ట్ నుంచి మట్టిని తరలించి ఇటుక బట్టీల వద్ద కుప్పకుప్పలుగా నిల్వ చేసి ఉంచారు. ప్రతి ఏటా వేసవి రాగానే బట్టీలకు అవసరమైన మట్టిని ప్రాజెక్ట్ నుంచి తరలిస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ముప్కాల్ మండలం నల్లూర్‌శివారులో ఆనకట్ట దిగువన ఒకటి, బాల్కొండ మండలం బస్సాపూర్ శివారులోని ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతంలో మరొకటి, జలాల్‌పూర్ శివారులోని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌నిలిచే ప్రాంతాలను ఆనుకుని రెండు ఇటుక బట్టీలు వెలిశాయి. మట్టిని తరలించేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవనే ఉద్దేశంతో ప్రాజెక్టు చుట్టూ ఇటుకబట్టీలు ఏర్పాటు చేశారు.



ఎస్సారెస్పీ ఆనకట్ట దిగువన ఇటుక బట్టీలో నిల్వ చేసిన మట్టి

భవన నిర్మాణమెన్నడో..?

- పాత భవనం కూల్చి ఏడాది పూర్తి
- ప్రారంభం కాని గ్రంథాలయ పనులు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ పట్టణంలోని గ్రంథాలయం శిథిలావస్థకు చేరడంతో అదే స్థలంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణం కోసం గత ఏడాది భవనాన్ని కూల్చివేశారు. నూతన భవన నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలికంగా ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలోని ఓ హాల్‌లోకి గ్రంథాలయాన్ని మార్చారు. గ్రంథాలయ నిర్మాణం కోసం మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రూ.40 లక్షలు మంజూరు చేసి భూమిపూజ చేశారు. పనులు ప్రారంభమై నూతన భవనం ఏడాదిలోగా పూర్తవుతుందని ఆశించారు. శిలాఫలకం వేసి 9 నెలలు పూర్తయినా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నేటికి తట్ట మట్టి



ఎత్తిపోయలేదు.

ఇబ్బంది పడుతున్న పాఠకులు

మినీ స్టేడియంలో ఇప్పటికే బస్తీ దవాఖానా కొనసాగుతుండగా, గ్రంథాలయాన్ని కూడా అక్కడికే తరలించారు. దీంతో పాఠకులకు స్థలం సరిపోక ఇబ్బంది పడ్తున్నారు. నిరుద్యోగులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. ప్రశాంతంగా చదువుకోవాల్సిన గ్రంథాలయ తాత్కాలిక భవనం నిత్యం ఆడుకోవడానికి వచ్చే క్రీడాకారులు, వ్యాయామం చేయడానికి వచ్చే వారితో సందడిగా ఉంటుండంతో పాఠకులు ఏకాగ్రత దెబ్బతింటోందని వాపోతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



నేను నిత్యం గ్రంథాలయానికి వస్తాను. ప్రస్తుతం డీ ఎస్సీ కోసం సిద్ధం అవుతున్నాను. సరిపడా స్థలం, వసతులు లేకపోవడంతో తాత్కాలిక గ్రంథాలయంలో ఇబ్బంది కలుగుతోంది. సంబంధిత శాఖాధికారులు స్పందించి వెంటనే భవన నిర్మాణ పనులు ప్రారంభించి పాఠకులకు విశాల గ్రంథాలయాన్ని అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.

– నాగరాజు, పాఠకుడు, బోర్లం

పుస్తకాలు పక్కన పెట్టాల్సి వస్తోంది



గ్రంథాలయంలో 26 వేల పుస్తకాలు ఉన్నాయి. వాటిని తాత్కాలిక భవనంలో భద్రపర్చడం ఇబ్బందిగా ఉంది. పోటీ పరీక్షల కోసం అవసరమైన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచడంతో ప్రతిరోజు సరాసరి 100 మంది నిరుద్యోగులు పోటీపరీక్షల సన్నద్ధత కోసం వస్తున్నారు. తాత్కాలిక భవనంలో పాఠకులు ఇబ్బంది పడ్తున్నా పట్టించుకునే వారు లేరు.

– సుధాకర్, గ్రంథపాలకుడు, బాన్సువాడ

కమీషన్లు.. పంపకాలు!



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో వైద్యం వ్యాపారంగా మారింది. ఎక్కడ చూసినా కమీషన్లు, పంపకాల మాటే వినబడుతోంది! గత దశాబ్దకాలంగా పల్లె, పట్టణం తేడా లేకుండా వైద్యం పేరుతో ఎవరికి వారు అందినకాడికి దండుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకం లేని ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రుల వైపు పరుగులు తీస్తుండడంతో ‘వైద్య వ్యాపారానికి’ ఢోకా లేకుండాపోయింది.

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటికి తోడు ల్యాబ్‌లు, ఎక్స్‌రే, సిటీ స్కానింగ్ సెంటర్ల సంఖ్య సైతం పెరుగుతోంది. జిల్లా కేంద్రంలో వందల సంఖ్యలో, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీల్లో పదుల సంఖ్యలో ప్రైవేట్ ఆస్పత్రులు ఉండగా మండల కేంద్రాల్లో సైతం ప్రైవేట్ ఆస్పత్రులు వెలుస్తూనే ఉన్నాయి. అయితే, కనీస నియమనిబంధనలను పాటించకుండానే వైద్యాధికారులు కమీషన్లు తీసుకొని అనుమతులు ఇస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇక పల్లెలు, పట్టణాల్లో సైతం ఆర్ఎంపీ, పీఎంపీలు వందల సంఖ్యలో ఉన్నారు. ప్రాథమిక చికిత్స చేయాల్సిన ప్రాక్టిషీయనర్లు ఇంజక్షన్లు, గ్లూకోజ్‌లు, యాంటిబయోటిక్స్ ఇస్తూ డబ్బులు దండుకుంటున్నారు. రోగిని రెండుమూడు రోజులు తమ వెనుక తిప్పుకొని ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఇక్కడే అసలు కథ మొదలవుతుంది.. ఒక రోగిని రిఫర్ చేస్తూ ఆర్ఎంపీలు, పీఎంపీలకు ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పతులు ఫీజులో నుంచి ఏకంగా 50శాతం కమీషన్‌గా ఇస్తున్నారనే బహిరంగ రహస్యమే. ఆర్ఎంపీ, పీఎంపీలు తాము చెప్పిన ఆస్పత్రికి కాకుండా రోగి వేరే ఆస్పత్రికి వెళ్తే స్థానికంగా మళ్లీ చికిత్స చేసేది లేదని బెదిరింపులకు పాల్పడడం కొసమెరుపు.

దొరికినంత దోచుకోవడమే..

వైద్యానికి సంబంధించి ఫీజుల వసూలుపై ఎలాంటి నియంత్ర లేకపోవడం ప్రైవేట్ ఆస్పత్రులకు వరంగా మారింది. ఒక్కో ఆస్పత్రిలో ఒక్కోరకంగా అడ్మిషన్ ఫీజు తీసుకుంటున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో రూ.300 చొప్పున చార్జి చేస్తుండగా, మరి కొన్ని ఆస్పత్రుల్లో రూ.400 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. రక్త పరీక్షలకు సైతం ఒక్కో ల్యాబ్‌లో ఒక్కో రకంగా దోచుకుంటున్నారు. ఎక్స్‌రే, సిటీస్కాన్, ఎంఆర్‌ఐ ఇలా ఏ ఫీజైనా తాము ఇష్టం వచ్చిన విధంగా వసూలు చేస్తున్నారు. ఆస్పత్రుల్లో డాక్టర్ ఫీజు నుంచి ఐసీయూ, ఎన్ఐసీయూ, సింగిల్ రూమ్, డబుల్‌రూమ్, షేరింగ్ రూమ్ ఇలా చార్జీలు తడిసిమోపెడవుతాయి. ఉదయం నుంచి సాయంత్రం లోగా ఆస్పత్రికి వచ్చే వారికి ఒక రకంగా, రాత్రి వేళల్లో వచ్చే రోగులకు మరో రకంగా ఫీజులు చార్జి చేస్తున్నారు.

వ్యాపారమైన వైద్యం

- పల్లెల్లో ఆర్ఎంపీ, పీఎంపీల ఇష్టారాజ్యం
- పట్టణాల్లో ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ
- ఫీజుల నియంత్రణ లేకపాయే..
- తనిఖీలతో కాలయాపన చేస్తున్న అధికారులు

లెక్కలు తీస్తామని..

జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులతోపాటు ఆర్ఎంపీ, పీఎంపీ సెంటర్ల లెక్క తీయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి తుకారాం రాథోడ్ ఆదేశాలు జారీ చేశారు. 50 బృందాలు వారం రోజుల్లో తనిఖీలు పూర్తి చేయాల్సి ఉండగా, ఈ నెల 4 నుంచి తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు తనిఖీలు పూర్తి కాకపోగా ప్రైవేట్‌ఆస్పత్రుల లెక్కతేలలేదు. నియమనిబంధనలు పాటించని ఆస్పత్రులు జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉన్నాయనేది బహిరంగ రహస్యమే.

రెండు రోజుల్లో తనిఖీలు పూర్తి

వారం రోజుల్లో ఆస్పత్రుల తనిఖీ పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ వివిధ కారణాలతో ఆలస్యమవుతోంది. మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ప్రైవేట్ ఆస్పత్రులు, ఆర్ఎంపీ, పీఎంపీల లెక్కకు సంబంధించిన జాబితాను తయారు చేస్తాం. ఆ తదుపరి నియమనిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం.

– తుకారాంరాథోడ్, డీఎంహెచ్‌వో

క్రైం కార్నర్

అప్పుల బాధతో ఆత్మహత్య

రామారెడ్డి: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన సుద్దాల చిన్నసాయిలు(51) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లేందుకు చిన్నసాయిలు అప్పులు చేశాడు. గల్ఫ్‌వెళ్లలేకపోగా అప్పులు పెరగడంతో సోమవారం రాత్రి వ్యవసాయభూమిలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు.

గల్ఫ్ ఏజెంట్ మోసం..

బహ్రెయిన్ వెళ్లేందుకు చిన్నసాయిలు మండలంలోని పోసానిపేటకు చెందిన గల్ఫ్ ఏజెంట్‌కు రూ.లక్షా 50వేలు కట్టాడని, ఏజెంట్ మోసం చేయడం, అప్పులు పెరగడంతో సాయిలు ఆత్మహత్య చేసుకున్నాడని గ్రామస్తులు చెబుతున్నారు. సదరు ఏజెంట్ అన్నారం గ్రామానికి చెందిన మరో ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.80వేల చొప్పున వసూలు చేశాడని అన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, బాధిత కుటుంబాలకు డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరారు. గల్ఫ్ ఏజెంట్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రామారెడ్డి మండలంలో వరుస ఆత్మహత్యలు కలకలం సృష్టిస్తున్నాయి. ఈనెలలో ఇప్పటి వరకు నలుగురు వ్యక్తులు వివిధ కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

ఉరేసుకుని వృద్ధుడు ..

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం) శివారులోని చెట్టుకు రెంజల్ మండలం దూపల్లికి చెందిన ఆకుల గంగారాం(60) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ సోమవారం తెలిపారు. మతిస్థిమితం కోల్పోయిన గంగారాం నాలుగు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటికి వచ్చి తిరిగి వెళ్లలేదన్నారు. అబ్బాపూర్(ఎం) శివారులో చెట్టుకు ఓ వ్యక్తి ఉరేసుకుని మృతి చెందినట్లు గ్రామస్తులు సమాచారం అందించారని, మృతుడిని దూపల్లికి చెందిన గంగారాంగా గుర్తించామన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

న్యావనందిలో భారీ చోరీ

- 18.5తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లిన దుండగులు

సిరికొండ: మండలంలోని న్యావనందికి చెందిన గణపురం శ్యామల అనే మహిళ ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగినట్లు ధర్పల్లి సీఐ భిక్షపతి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తన పెద్దనాన్న చనిపోవడంతో గణపురం శ్యామల రెండు రోజుల క్రితం రావుట్ల గ్రామానికి తన చిన్న కొడుకుతో కలిసి వెళ్లింది. ఇంటి వద్ద మిగతా ఇద్దరు కుమారులు రోహిత్, ప్రణయ్ ఉన్నారు. ఆదివారం రాత్రి భోజనం చేసిన తరువాత ఇంటికి తాళం వేసి పైన పోర్షన్‌లో రోహిత్, ప్రణయ్‌తోపాటు వారి స్నేహితుడు మారుతి పడుకున్నారు. సోమవారం ఉదయం 7 గంటల తర్వాత కిందికి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండగా, అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా బెడ్ రూమ్ తలుపు సైతం తెరిచి ఉంది. వారు వెంటనే తల్లికి ఫోన్ చేసి చోరీ విషయం తెలిపారు. రావుట్ల నుంచి ఇంటికి చేరుకున్న శ్యామల లోపలికి వెళ్లి చూడగా.. బెడ్ రూమ్‌లోని కప్‌బోర్డ్‌లో దాచిన 9 తులాల బంగారు హారం, నాలుగు తులాల నల్లపూసల హారంతోపాటు మూడు తులాల గొలుసు, రెండు తులాల బ్రాస్లెట్, అర తులం బంగారు ఉంగరం ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ భిక్షపతి, సీసీఎస్ ఏసీపీ కిషన్, ధర్పల్లి, సిరికొండ ఎస్సైలు విక్రం, బాల్‌సింగ్ గ్రామానికి చేరుకొని చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



తనిఖీలు నిర్వహిస్తున్న డాగ్‌స్క్వాడ్

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవీపేట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని జన్నేపల్లి శివారులో పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ సోమవారం తెలిపారు. నాళేశ్వర్ నుంచి జన్నేపల్లి వైపు ఆదివారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదు అందడంతో ట్రాక్టర్‌ను పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జీజీహెచ్ ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి (60) మృతి చెందినట్లు ఎస్సై విజయ్‌బాబు సోమవారం తెలిపారు.

మృతుడు భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడని, ముస్లిం వర్గానికి చెందిన వ్యక్తి అయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి ఒంటిపై బ్రౌన్ కలర్ షర్ట్, బ్లూ కలర లుంగీ ఉందని, ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో లేదా 87126 59837, 87125 9714, 08462-220150 నంబర్లను సంప్రదించాలని ఎస్సై సూచించారు.

గిజిగాడి గూడు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కన ఉన్న ఈత చెట్టుకు ఉన్న గిజిగాడి గూళ్లు చూపరులు ఆకట్టుకుంటున్నాయి. శబరి మాత ఆశ్రమం, హన్‌మాన్ ఆలయం మధ్యలో ఉన్న ఈతచెట్టు చుట్టూ పిట్టలు అల్లిన గూళ్లు అందంగా కనిపించడంతో భక్తులతోపాటు దారి వెంట వెళ్లే ప్రయాణికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

